

ఉగాదికి ముస్తాబైన 'రాజన్న'

వేములవాడ: ఉగాది పండుగ సందర్భంగా రాజన్న ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించారు. ఈనెల 30న సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



బోనం మొక్కులు

వేములవాడ: వేములవాడ బద్దిపోచమ్మకు భక్తులు మంగళవారం బోనం మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి కల్లుశాక సమర్పించారు.


వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/21.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత ఉంటుంది. రాత్రిపూట స్వల్ప చలితీవ్రత ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

రాజ్యపూజ్యమే లక్ష్యం!

- విజయలక్ష్మి కటాక్షానికి అన్ని పార్టీల తహతహ
- అభివృద్ధి గెలిపిస్తుందని కారుపార్టీ ధీమా
- వ్యతిరేకత విజయాన్నిస్తుందని ప్రతిపక్షాల విశ్వాసం
- ఉగాది వేళ.. జాతకాల్లో అదృష్టం వెతుక్కుంటున్న నేతలు
- నూతన పంచాంగంలో కొత్త ఆశలతో ముందుకు..



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తెలుగువారి కొత్త సంవత్సరాది ఉగాది. శోభకృత్ నామ సంవత్సరం సందర్భంగా ప్రతీ ఒక్కరూ తమ జాతకాన్ని కొత్త పంచాంగంలో వెతుక్కుంటున్నారు. ఈ ఉగాది సాధారణ ప్రజల కంటే.. రాజకీయ నాయకులకు ఎంతో కీలకమైంది. అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలు, ప్రతిపక్షంలో ఉన్న ప్రత్యర్థులు, ఈసారి ఎన్నికల బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుందామనుకునే ఆశావహులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో అధికార-ప్రతిపక్ష నేతలంతా నూతన పంచాంగంలో తమ జాతకాలలో ఆదాయ వ్యయాల మాట ఎలా ఉన్నా.. రాజ్యపూజ్యంపైనే కన్నేశారు. అవమానాల మాట పక్కనబెట్టి.. రాజ్యపూజ్యం దక్కుతుందా? లేదా అన్న అంశంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితిని ఒకసారి పరిశీలిస్తే..

జగిత్యాల: డాక్టర్ సంజయ్ ఇప్పటికే వరుసగా గ్రామాల్లో పర్యటిస్తూ.. పల్లె నిద్ర పేరుతో ప్రజలకు చేరవవుతున్నారు. ఇక మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి (కాంగ్రెస్) కూడా పోటాపోటీగా పర్యటనలు చేస్తున్నారు. ఇటీవల భోగశ్రావణి బీజేపీ నుంచి బరిలోకి దిగేందుకు ఆసక్తిగా ఉన్నారు.

కోరుట్ల: ప్రస్తుత ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు(బీఆర్ఎస్) వరుసగా అభివృద్ధి పనులు, శంకుస్థాపనలు అంటూ పర్యటిస్తున్నారు. ఈసారి జువ్వాడి నర్సింగరావు (కాంగ్రెస్) గట్టి పోటీ ఇచ్చేందుకు సంసిద్ధంగా ఉన్నారు. మార్పులు జరిగితే వీరిద్దరు కూడా తమ కుమారులను బరిలో దింపుతారన్న ప్రచారం జోరుగా జరుగుతోంది.

ధర్మపురి: ఇక్కడ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్ (బీఆర్ఎస్)కు ఈసారి గట్టి పోటీ ఉంది. ఇక్కడ నుంచి అడ్లూరి లక్ష్మణ్ (కాంగ్రెస్), మాజీ ఎంపీ గడ్డం వివేక్ (బీజేపీ) కూడా బరిలోకి దిగుతారని ప్రచారం సాగుతోంది.

➡ **సిరిసిల్ల:** ఇక్కడి నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రి కేటీఆర్‌కు ప్రత్యర్థులు పెద్దగా లేరు. కాంగ్రెస్ నుంచి కె.కె.మహేందర్‌రెడ్డి మినహా ఇక్కడ ఆయనకు గట్టి వైరిపక్షం కానరావడం లేదు. ఈసారి బీజేపీ మాత్రం సెలబ్రిటీని రంగంలోకి దించుతారన్న ప్రచారం సాగుతోంది.

పెద్దపల్లి: ప్రస్తుత ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి (బీఆర్ఎస్)కి సొంత పార్టీ నుంచే తీవ్ర పోటీ ఉంది. ఎమ్మెల్యే టికెట్ కోసం.. సొంత పార్టీకే చెందిన ఎన్నారై నల్ల మనోహర్‌రెడ్డి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ నేత విజయరమణారావు నుంచి వీరికి గట్టి పోటీ ఎదురవనుంది. బీజేపీ నుంచి గుజ్జుల రామక్రిష్టారెడ్డి, దుగ్యాల ప్రదీప్‌రావు, గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. బీఎస్పీ నుంచి దాసరి ఉష బరిలో ఉన్నారు.

మంథని: ప్రస్తుత ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు (కాంగ్రెస్)కు, పుట్ట మధు (బీఆర్ఎస్)కు ఈసారి హోరాహోరీ పోరు నడవనుంది. ఇక్కడ వీరిద్దరు మినహా మూడో పార్టీ అభ్యర్థులెవరూ ఇంతవరకూ ఆసక్తి చూపలేదు.

రామగుండం: ఎమ్మెల్యే కే.చందర్‌కు కాంగ్రెస్ నేత ఠాకూర్ మక్కాన్ సింగ్ (కాంగ్రెస్) నుంచి గట్టిపోటీ ఉండనుంది. వీరితోపాటు మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ (బీజేపీ) కూడా బరిలో ఉండటంతో పోరు రసవత్తరంగా మారనుంది.

కరీంనగర్: బీఆర్ఎస్ మంత్రి గంగుల కమలాకర్ తీగల వంతెన, ఎమ్మారెఫ్, స్మార్ట్ సిటీ పనులతో కరీంనగర్‌పై ఫోకస్ పెట్టారు. హిందుత్వం, మార్పు అన్న ఎజెండాతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నుంచి పోటీ ఎదరవనుంది. బీజేపీ నుంచి కొత్త జయపాల్‌రెడ్డి కూడా ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి ఎమ్మెస్సార్ మనవడు రోహిత్, నగరాధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. వైస్సార్ టీపీ నుంచి డాక్టర్ నగేశ్ బరిలో నిలవనున్నారు.

➡ **వేములవాడ:** ప్రస్తుత ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ (బీఆర్ఎస్)కు చిరకాల ప్రత్యర్థి ఈసారి కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీజేపీ నుంచి చెన్నమనేని విద్యాసాగర్ రావు కుమారుడు వికాస్ పేరు వినిపిస్తుండగా.. తాను స్వతంత్రంగానైనా పోటీచేస్తానని అదే పార్టీ నేత తుల ఉమ ఇప్పటికే ప్రకటించారు. ఎన్నారైలు గోలి మోహన్ (ఇప్పటికే నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు), మరో ఎన్నారై తోట రాంకుమార్ కూడా బరిలో నిలిచేందుకు ఆసక్తిగా ఉన్నారు.

చొప్పదండి: ప్రస్తుతం ఎమ్మెల్యే రవిశంకర్ (బీఆర్ఎస్)కు ఇంటిపోరు తప్పేలా లేదు. అదేపార్టీ నుంచి గజ్జెల కాంతం, కత్తెరపాక కొండయ్య, కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ టికెట్ రేసులో ఉన్నారు. ఈసారి మేడిపల్లి సత్యం (కాంగ్రెస్) నుంచి గట్టి పోటీ ఇవ్వనున్నారు. బీజేపీ నుంచి బొడిగె శోభ, సుద్దాల దేవయ్యల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. వైఎస్సార్‌టీపీ నుంచి అక్కెనపల్లి కుమార్ బరిలో నిలవనున్నారు.

మానకొండూరు: ఇక్కడ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రసమయి బాలకిషన్‌కు ఈసారి ఇంటి పోరు తీవ్రంగానే ఉంది. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఓరుగంటి ఆనంద్ కూడా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి కవ్వంపల్లి సత్యనారాయణ, బీజేపీ నుంచి గడ్డం నాగరాజు, దరువు ఎల్లన్న బరిలో నిలవనున్నారు.

హుజూరాబాద్: గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఈటల రాజేందర్ ప్రస్తుతం బీజేపీలో ఉన్నారు. బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఈసారి బరిలో దిగనున్నారు. కాంగ్రెస్ నుంచి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.



నూతన 'శోభ'

సిరిసిల్లకల్చరల్: మెరిసిపోయే ప్రకృతి.. గొంతెత్తి పాడే కోయిల.. మావిచిగురు, వేపపూత పరిమళాలతో పరిసరాలన్నీ పరవశించే సమయం ఉగాది పర్వదినం. తిరిగిరానికాలం తీసుకొచ్చే అనుభూతులు, అనుభవాలు మనుషుల జీవితాల్లో మధురమైన జ్ఞాపకాలుగా మారుతాయి. వేప పువ్వు, బెల్లం, చింతపండు, నెయ్యి, మిరియాలు, ఉప్పు మిశ్రమాలతో షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి. బుధవారం ఉమ్మడి జిల్లావాసులు శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగ జరుపుకోనున్నారు.

న్యూస్‌రీల్

'పది' విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



విద్యార్థుల ప్రతిభను పరీక్షిస్తున్న డీఈవో

సిరిసిల్లఎడ్యుకేషన్: పదిరోజుల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఈవో రమేశ్ కుమార్ అన్నారు. మంగళవారం నెహ్రూనగర్ పాఠశాలను సందర్శించారు. ప్రత్యేక తరగతులు, అల్పాహారం గురించి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు రాసిన అంతర్గత పరీక్షల్లో వచ్చిన మార్కులు, విద్యార్థులు పురోగతిని పరిశీలించారు. వెనకబడిన విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో జరుగుతున్న వ్యాయమ ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. సెక్టోరల్ ఆఫీసర్ శైలజ, ప్రధానోపాధ్యాయులు అనురాధ పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు రాజన్న అర్చకులు



అప్పాల భీమాశంకర శర్మ, స్థానాచార్యులు



చంద్రగిరి శరత్‌శర్మ, ఉపప్రధాన అర్చకులు

వేములవాడ: రాష్ట్ర ప్రభుత్వం ఏటా అందించే ఉగాది పురస్కారాలకు వేములవాడ రాజన్న ఆలయానికి చెందిన ముగ్గురు అర్చకులు ఎంపికయ్యారు.ఆగమశాస్త్ర నిపుణుడిగా చంద్రగిరి శరత్‌శర్మ, అర్చకత్వంలో స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ, వేదపండితుడిగా ఆంజనేయులు శర్మలను ఎంపిక చేశారు. వీరు బుధవారం సీఎం కేసీఆర్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకోనున్నారు.

జిల్లాలో 3,283 మందికి కంటి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో కంటివెలుగులో భాగంగా మంగళవారం 26 ప్రాంతాల్లో 3,283 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. 570 మందికి రీడింగ్ అద్దాలు అందించారు. మరో 491 మందికి పాయింట్ అద్దాలు పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 41 రోజులుగా 1,56,216 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 25,983 మందికి రీడింగ్ కంటి అద్దాలను పంపిణీ చేశారు. మరో 20,486 మందికి పాయింట్ కంటి అద్దాలను అందించారు.

సంవేదనలోంచి వచ్చేదే సాహిత్యం



మాట్లాడుతున్న డాక్టర్ నలిమెల భాస్కర్

సిరిసిల్లకల్చరల్: సంవేదన, సంఘర్షణకు లోనైన హృదయంలోంచి వెలువడేదే కదిలించే సాహిత్యంగా నిలుస్తుందని పలువురు వక్తలు అన్నారు. జిల్లా రచయితల సంఘం, గ్రంథాలయ సంస్థ సంయుక్త నిర్వహణలో మంగళవారం కేంద్ర గ్రంథాలయ భవనంలో ఉగాది కవి సమ్మేళనం, ప్రపంచ కవితా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బహుభాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్, సినీ గీత రచయిత డాక్టర్ వడ్డెపెల్లి కృష్ణ, కథా రచయిత డాక్టర్ బీవీఎన్ స్వామి, ఉత్తమ మహిళా పురస్కార విజేత డాక్టర్ కందేపి రాణీప్రసాద్, జిల్లా పౌర సంబంధాల అధికారి మామిండ్ల దశరథం, గ్రంథాలయ సంస్థచైర్మన్ ఆకునూరి శంకరయ్య తదితరులు హాజరై మాట్లాడారు. భాష, యాసల మధ్య వ్యత్యాసాన్ని తెలంగాణ భాష ప్రాశస్త్యాన్ని వివరించారు. కవిత్వ రచనకు సంబంధించిన మౌలిక లక్షణాలను వివరిస్తూనే సామాజిక చైతన్యం దిశగా కవిత్వం అడుగులు వేసేలా ఉండాలన్నారు. అనంతరం సుమారు 30 మంది కవులు, విద్యార్థులు ఉగాది కవితలను వినిపించారు.సమకాలీన అంశాలపై స్పందించి రాసిన కవితలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కవులు అందరికీ ప్రశంసాపత్రాలు, శాలువాలతో సత్కరించారు. జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు ఎలగొండ రవి, వాసరవేని పరశురాం, గెంట్యాల భూమేశ్, ఆడెపు లక్ష్మణ్, జిందం అశోక్, బూర దేవానందం, ఈడెపు సొమ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం జరిగేలా పనిచేయాలి



నేరసమీక్షలో ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జిల్లాలో నేరాల నియంత్రణతో పాటు ఛేదనలో అధికారులు నిర్దిష్ట ప్రణాళికతో పనిచేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేరసమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రతీకేసులో సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూరేలా చూడాలన్నారు. జిల్లాలో నమోదు అవుతున్న ఆయా కేసుల్లో పోలీసులు పకడ్బందీగా, పారదర్శకంగా విచారణ చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారం, నిందితులకు శిక్షపడే విధంగా చేసి కన్విక్షన్ రేటును పెంచాలని సూచించారు. ఎస్సీ,ఎస్టీ, పోక్సో కేసులపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై, తప్పించుకుని తిరుగుతున్నవారిపై అమలుపరచడానికి కృషి చేయాలని సూచించారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ డయల్ 100 ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని అన్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు విశ్వప్రసాద్, నాగేంద్రచారి, రవికుమార్, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

లే అవుట్ లేని స్థలాలు కొనొద్దు



వెంకటాపూర్ శివారులో ఫ్లెక్సీ కట్టిన గ్రామపంచాయతీ సిబ్బంది

సిరిసిల్ల: జిల్లాలో లే అవుట్ అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగుతుంది. దీనిపై 'సాక్షి'లో 'అంతా మాయ' శీర్షికన మంగళవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ లే అవుట్ లేకుండా రియల్ ఎస్టేట్ వెంచర్లు చేసిన స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ శివారుల్లో గ్రామపంచాయతీ అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అనుమతి లేని ప్లాట్లు కొనవద్దని హెచ్చరించారు. 'సాక్షి' కథనంతో జిల్లాలో అనుమతి లేని రియల్ మోసాలు వెలుగులోకి వస్తున్నాయి.

క్లుప్తంగా

లింగంపల్లికి చేరిన విద్యుత్ స్తంభాలు



సాక్షి ఎఫెక్ట్

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల పరిస్థితిపై ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు శీర్షికన 'సాక్షి' దినపత్రికలో మంగళవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం లింగంపల్లికి కొత్త స్తంభాలను తెప్పించారు. వేములవాడ రూరల్ మండలంలోని 17 గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు. అవసరం ఉన్నచోట ట్రాన్స్‌ఫార్మర్లు బిగించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పలు పల్లెల్లో స్థానికులు సహకరించకపోవడంతో ఆలస్యం జరుగుతోందన్నారు. ఈ విషయంలో అన్ని గ్రామాల ప్రజలు సెస్ అధికారులకు సహకరించాలని కోరారు.

గురుకులం.. సమస్యలతో సతమతం

- జిల్లాలో 39 విద్యాలయాలు
- విద్యార్థులకు కనీస వసతులు కరువు
- నిధులు పక్కదారి పట్టడమే కారణమని ఆరోపణలు



అస్వస్థతకు గురైన విద్యార్థులను పరిశీలిస్తున్న వైద్యులు, ప్రజాప్రతినిధులు (ఫైల్)



తంగళ్లపల్లి గురుకులం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, తల్లిదండ్రులు (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): నిరుపేదల పిల్లలకు చక్కగా చదివి, గొప్పగా ఎదగాలన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసింది. వసతితోపాటు పౌష్టికాహారం అందించాలని నిర్ణయించింది. ఆశయం గొప్పదే అయినప్పటికీ ఆచరణలో మాత్రం లోపాలు కనిపిస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు అంటున్నారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు పక్కదారి పడుతున్నాయని ఆరోపిస్తున్నారు. విద్యార్థులకు కనీస వసతులు కల్పించడం లేదని చెబుతున్నారు.

13,465 మంది విద్యార్థులు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 13 మండలాలు ఉండగా జిల్లా వ్యాప్తంగా 39 గురుకులాలు ఉన్నాయి. ఆయా విద్యాలయాల్లో 13,465 మంది విద్యార్థులు చదువుతున్నారు. అన్ని మండలాలతో పోలిస్తే అత్యధికంగా తంగళ్లపల్లి మండలంలో 7 గురుకులాలు ఉన్నాయి.

సమస్యలు ఇవీ..

తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాల, ఫైన్ ఆర్ట్స్ అకాడమీ తంగళ్లపల్లి, మైనారిటీ బాలికల పాఠశాల, కళాశాల తంగళ్లపల్లి అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. విద్యార్థినులు స్నానం చేసేందుకు వేడి నీటి సౌకర్యం లేదు. సరిపడా టాయిలెట్లు, స్నానపు గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గదుల్లో కూర్చోవడానికి బెంచీలు, డైనింగ్ హాళ్లలో డైనింగ్ టేబుళ్లు లేవు. కొన్ని గురుకులాల్లో డార్మెటరీలు లేకపోవడంతో తరగతి గదిలోనే సామగ్రి సర్దుకొని, పొద్దంతా తరగతి గదిలా రాత్రి నిద్రించడానికి వాడుతున్నారు. శుభ్రమైన తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్‌లు ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వం అందించే దుస్తులు, బ్లాంకెట్లు, శానిటరీ హెల్త్ కిట్స్ అందించడంలో ఆలస్యం జరుగుతోంది. పౌష్టికాహారం అందించడంలోనూ అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కలుషిత ఆహారం తిని విద్యార్థులు తరచూ జబ్బు పడుతున్నారు. గురుకులాల్లో ఆరోగ్య సిబ్బందిని నియమించడంలో తాత్సారం చేస్తుండటంతో చాలాచోట్ల సిబ్బంది అందుబాటులో లేరు.

సౌకర్యాల కల్పనలో విఫలం



గురుకుల పాఠశాలలు, కళాశాలలు పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారాయి. ఈ విద్యాలయాల్లో చదువుతున్న పేద పిల్లలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు.

– మల్లారపు ప్రశాంత్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

పర్యవేక్షణ లోపించింది..



గురుకులాల ఏర్పాటులో ప్రభుత్వ ఆశయం హర్షించదగినదే అయినప్పటికీ ఆచరణలో లోపాలు కనిపిస్తున్నాయి. విద్యాలయాలపై పర్యవేక్షణ లోపించింది. కనీస సౌకర్యాలు కల్పించకపోవడం బాధాకరం.

– కంచర్ల రవి గౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్

పోరాటాలు చేస్తాం..



గురుకుల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేంత వరకు పోరాటాలు చేస్తాం. పాఠశాలలు, కళాశాలల్లో కనీస సౌకర్యాలు, పౌష్టికాహారం, వసతులను సాధించడమే లక్ష్యంగా భీమ్ ఆర్మీ ముందుకు సాగుతుంది.

– దొబ్బల ప్రవీణ్, భీమ్ ఆర్మీ విద్యార్థి నాయకుడు

బైండోవర్ అతిక్రమించిన ఇద్దరికి జరిమానా



రూ.లక్ష జరిమానా చెల్లిస్తున్న ఎల్లయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గుడుంబా కేసుల్లో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు మంగళవారం రూ.లక్ష చొప్పున జరిమానా చెల్లించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన జాగిరి ఎల్లయ్య, అల్మాస్‌పూర్ తండాకు చెందిన భూక్య కళ గుడుంబా విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిని గతేడాది ఏప్రిల్, సెప్టెంబర్‌లలో అరెస్టు చేసి, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బైండోవర్‌ను ఆషామాషీగా తీసుకోవద్దన్నారు. మళ్లీ నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇద్దరు నిందితుల వద్ద నుంచి రూ.2 లక్షలు వసూలు చేసి, ప్రభుత్వ ఖజానాలో జమ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై శైలజ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో తరగతి గదులు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కార్పొరేట్‌కు దీటుగా పల్లెల్లో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ.. ఆధునిక హంగులతో తరగతి గదులను తీర్చిదిద్దుతున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ ప్రభుత్వ పాఠశాలలో రూ.23 లక్షలతో నిర్మించే అదనపు తరగతి గదుల కోసం మంగళవారం స్థల పరిశీలన చేశారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. నాయకులు నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, షాదుల్లా, వేణు, పర్శురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి సమీపంలో చిరుత సంచారం?

ఇల్లంతకుంట(సిరిసిల్ల): మండలంలోని అనంతగిరి సమీప ఈతవనంలో చిరుత పులి సంచరిస్తోందన్న విషయం మండలవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పలువురికి ఈత వనం దగ్గర చిరుత కనిపించిందని తెలియడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఫారెస్టు అధికారులు స్పందించి, చిరుత పులి భారినుంచి తమను రక్షించాలని కోరుతున్నారు.

మనవడు దూరంగా ఉన్నాడని..

- మనస్తాపంతో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న రిటైర్డ్ ఎంపీడీవో
- ఘటన స్థలంలోనే మృతి
- ఆర్పడానికి వెళ్లిన భార్య, కొడుకుకు అంటుకున్న మంటలు



మంటల్లో కాలిపోయిన మధుసూదన్‌రావు

కరీంనగర్‌క్రైం: రోజూ తనతో సరదాగా ఆడుకునే మనవడు మూడు రోజులు దూరం కావడంతో తాత మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఉన్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ టూటౌన్ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. నగరంలోని కశ్మీర్‌గడ్డకు చెందిన అన్నమనేని మధుసూదన్‌రావు(82) ఎంపీడీవోగా రిటైర్డ్ అయి ఇంట్లోనే ఉంటున్నాడు. అతడికి భార్య సులోచన, ఇద్దరు కూతుర్లు దాచవరం మంజుల, దాచవరం మాధవి. ఇద్దరూ ప్రభుత్వ టీచర్లు. పెద్ద కొడుకు కృష్ణారావు పాఠశాల విద్యాశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. చిన్న కొడుకు వెంకటేశ్వర్‌రావు కరీంనగర్‌రూరల్ మండలంలోని ఒక మెడికల్ కళాశాలలో లైబ్రేరియన్‌గా చేస్తున్నాడు. వెంకటేశ్వర్‌రావు కొడుకు మణికంఠ ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నాడు. మధుసూదన్‌రావు దంపతులు కింది పోర్షన్‌లో, వెంకటేశ్వర్‌రావు మొదటి అంతస్తులో ఉండేవారు. మధుసూదన్‌రావుకు మనవడు సన్నిహితంగా ఉండడంతో ఇద్దరిమధ్య బలమైన బంధం ఏర్పడింది. రోజూ మనవడిని చూడనిదే తాత ఉండేవాడు కాదు. మూడు రోజుల క్రితం వెంకటేశ్వర్‌రావు భార్య జ్యోతి అలియాస్ వాణి ఇంట్లో చిన్న గొడవతో కొడుకును తీసుకొని పుట్టింటికి వెళ్లింది. దీంతో మధుసూదన్‌రావు మూడు రోజుల నుంచి మనవడిని కలవరించాడు. మనవడిపై మనస్తాపంతో మంగళవారం ఇంట్లో ఉన్న పెట్రోల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఇంటిబయట ఉన్న అతడి భార్య కేకలు వేయడంతో పై అంతస్తులో ఉన్న కుమారుడు వెంకటేశ్వర్‌రావు కిందికి వచ్చే సరికి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మంటల్లో కాలి మధుసూదన్‌రావు చనిపోగా ఆర్పడానికి యత్నించిన భార్య, కుమారుడికి మంటలు అంటుకున్నాయి. స్థానికులు వెంటనే ఫైర్ అధికారులకు సమాచారమందించగా నిమిషాల్లో చేరుకొని మంటలు ఆర్పేశారు. అప్పటికే మధుసూదన్‌రావు మృతిచెందగా, గాయపడిన సులోచన, వెంకటేశ్వర్‌రావును ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సులోచన చికిత్స పొందుతుండగా, వెంకటేశ్వర్‌రావును హైదరాబాద్ తరలించినట్లు సమాచారం. టౌన్ ఏసీపీ తుల శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ లక్ష్మీబాబు, ఎస్‌ఐలు శ్రీనివాస్, రాజప్రమీలా ఘటన స్థలాన్ని పరిశీలించారు. వెంకటేశ్వర్‌రావును మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి వాంగ్మూలం ఇప్పించినట్లు తెలిసింది. తన తండ్రి మనవడిపై మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని పెద్ద కూతురు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.


అనాథ చిన్నారికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న సెస్ సిబ్బంది

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు.. తల్లి వదిలేయడంతో ఆ చిన్నారి అనాథగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన ఆగుళ్ల భాస్కర్ ఇటీవల అనారోగ్యంతో చనిపోయాడు. రెండేళ్ల పాప అనూషతో అతని భార్య గొల్లపల్లిలోని తల్లిగారింటికి వెళ్లింది. ఈ క్రమంలో ఉన్నట్టుండి 15 రోజుల క్రితం పాపను వదిలేసి, వెళ్లిపోయింది. తల్లిదండ్రులు లేక వృద్ధులైన అమ్మమ్మ, తాతయ్య వద్ద ఉంటున్న ఆ చిన్నారి పరిస్థితిని చూసి, సెస్ సిబ్బంది చలించిపోయారు. మంగళవారం రూ.11 వేల ఆర్థిక సాయం, ఆకుల మురళీగౌడ్ బియ్యం అందించారు. పాపను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుడుంబా విక్రేత బైండోవర్



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అల్మాస్‌పూర్ తండా, అక్కపల్లి గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. గుడుంబా విక్రయిస్తున్న అల్మాస్‌పూర్ తండాకు చెందిన దరావత్ భారతిని అరెస్టు చేసి, తహసీల్దార్ జయంత్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. గుడుంబా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామని ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. రూ.లక్ష వ్యక్తిగత పూచీకత్తుపై భారతిని విడుదల చేశామన్నారు. ఎస్సై శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏవీఎన్ గెలుపుతో టీచర్ల సమస్యలు పరిష్కారం

బోయినపల్లి(చొప్పదండి): హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఏవీఎన్ రెడ్డి విజయం సాధించడంతో రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమవుతాయని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏవీఎన్ రెడ్డి విజయం కోసం రాష్ట్రంలోని ఉపాధ్యాయ లోకం ఎదురుచూసిందని తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా కృషి చేయాలని కోరారు.

రాజన్న ఆలయంలో విజిలెన్స్ తనిఖీలు!

వేములవాడ: స్థానిక శ్రీరాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది. ఆలయంలోని పలు విభాగాల్లో పని చేస్తున్న సిబ్బంది, ఉద్యోగులు నకిలీ సర్టిఫికెట్లతో పదోన్నతులు పొందడంతోపాటు పలు అవకతవకలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు అనిల్‌కుమార్, వరుణ్ ప్రసాద్, దినేశ్ రెడ్డిలతో కూడిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం విచారణ జరిపినట్లు సమాచారం.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



సీపీఆర్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్ల: ఒత్తిడితో కూడిన జీవనంతో గతంలో కన్నా ఎక్కువమంది గుండెపోటుకు గురవుతున్నారని దీనిపై అందరికీ అవగాహన ఉంటే ప్రాణహాని తప్పుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్)పై ఏఎన్‌ఎంలకు, ఆశ వర్కర్లకు శిక్షణ ఇచ్చారు. అరుణ మాట్లాడుతూ గుండెపోటు వచ్చినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియక ప్రాణాలు పోతున్నాయన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ.. విలువైన ప్రాణాలను కాపాడడమే సీపీఆర్ లక్ష్యమన్నారు. ఆహార అలవాట్లు, మారిన జీవన శైలి, పని ఒత్తిడితో గుండెపోటుకు గురవుతున్నారని ఆయన వివరించారు. సీపీఆర్ చేసే విధానాన్ని వేదికపై చేసి చూపించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, జిల్లా ఇమ్యూనేజేషన్ అధికారి డాక్టర్ మహేశ్, సిరిసిల్ల అర్బన్, ఇల్లంతకుంట, కోనరావుపేట, తంగళ్లపల్లి మండలాల ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు ఉన్నారు.

ఎకరానికి రూ.50 వేల పరిహారం ఇవ్వాలి



రామన్నపల్లెలో వరిని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ ప్రతినిధుల బృందం తంగళ్లపల్లి మండలంలోని రామన్నపల్లిలో పర్యటించింది. గ్రామంలో పంట నష్టాన్ని పరిశీలించారు. వడగండ్ల వానతో జిల్లాలో 20 వేల ఎకరాల్లో వరి, మామిడి తోటలు దెబ్బతిన్నాయని తెలిపారు. రైతులు అప్పులు చేసి, పంటలు సాగు చేస్తే అకాల వర్షం వారికి తీవ్ర నష్టం కలిగించిందని అన్నారు. సర్కారు స్పందించి, వరి పంటకు ఎకరానికి రూ.50 వేలు, మామిడితోటలకు ఎకరానికి రూ.30 వేలు చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. అలాగే రైతులందరికీ రూ.లక్ష రుణమాఫీ వెంటనే చేయాలన్నారు. నాయకులు మంచికట్ల రమేశ్, సోమ నాగరాజు, లక్ష్మణ్, శ్రీనివాస్, విఠల్ రెడ్డి, మల్లేశం, బాల్‌రెడ్డి, ప్రభాకర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యంగా ముందుకెళ్లండి


- టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు



కిషన్‌యాదవ్‌ను సన్మానిస్తున్న రవీందర్‌రావు

సిరిసిల్లఅర్బన్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు సింగిల్‌విండో చైర్మన్‌గా ఎన్నికైన జీల కిషన్ యాదవ్‌ను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమష్టి కృషితోనే సహకార సంఘం అభివృద్ధి సాధ్యమన్నారు. రైతుల శ్రేయస్సే లక్ష్యంగా ముందుకెళ్లాలని చెప్పారు. మైసమ్మ చెరువు సమీపంలో గోదాం నిర్మాణానికి, బైపాస్ రోడ్డులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి స్థల సేకరణ అంశాలను మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్లు సత్యనారాయణ, రెడ్డి నాయక్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ నారాయణ, డైరెక్టర్లు రమణారావు, బాలరాజ్ యాదవ్, మంగ కిరణ్, లీల, భాగయ్య, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వేములవాడ ఏరియా ఆసుపత్రి సందర్శన



ఆసుపత్రిలో పరిశీలిస్తున్న కాయకల్ప బృందం

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని వేములవాడ ఏరియా ఆసుపత్రిని కాయకల్ప బృందం సభ్యులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం, రోగులకు అందుతున్న వైద్యసేవలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అవార్డుకు ఎంపికైతే ఆసుపత్రి నిర్వహణకు నగదు ప్రోత్సాహం అందిస్తారు. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన కాయకల్ప బృందం సభ్యులు డాక్టర్ యాదయ్య, సిస్టర్ ఇందిర, ఆసుపత్రి వైద్యులు తిరుపతి, అనిల్ కుమార్, సంతోష్ చారి, వెంకట్, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం



సెంట్రల్ టీంతో వైద్యాధికారులు, సిబ్బంది

తంగళ్లపల్లి(సిరిసిల్ల): స్థానిక పీహెచ్‌సీని మంగళవారం జాతీయ నాణ్యతా ప్రమాణాల సభ్యులు(కేంద్ర బృందం) డాక్టర్ అనిర్బాన్ హోరే, డాక్టర్ కల్‌దీప్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు వారికి పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్యసేవలు వివరాలు తెలిపారు. అనంతరం కేంద్ర బృందం సభ్యులు మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది పనితీరును మెచ్చుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు, మెడికల్ ఆఫీసర్లు స్నేహ, రేణుప్రియాంక, ప్రమోద, క్వాలిటీ మేనేజర్ విద్యాసాగర్, డీపీవో ఉమ, సూపర్‌వైజర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్ పిల్లల ఎదుగుదలకు సహకరించాలి



మాట్లాడుతున్న డాక్టర్ మురళీధర్‌రావు

సిరిసిల్లకల్చరల్: పుట్టుకతో వచ్చే జన్యు సంబంధ డౌన్ సిండ్రోమ్ వ్యాధి ఉన్న పిల్లల ఎదుగుదలకు సహకరించాలని జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ మురళీధర్‌రావు కోరారు. రాజన్న అకాడమీ ఆఫ్ పీడియాట్రిషియన్స్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ డౌన్ సిండ్రోమ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ అధ్యక్షుడైన ఆయన మాట్లాడుతూ.. జన్యులోపాల కారణంగా సంభవించే వ్యాధి కారణంగా చిన్న పిల్లల్లో ఎదుగుదల ఉండదన్నారు. వారిలో ఆలోచనాస్థాయి కూడా తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడియాట్రిషియన్లు సాయికుమార్ తడుక, శ్రవణ్‌రెడ్డి, నళిని, అంబేడ్కర్, ఉమేశ్, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

కార్గో ద్వారా రాములోరి కల్యాణ తలంబ్రాలు

సిరిసిల్లఅర్బన్: శ్రీరామనవమి రోజు భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణానికి హాజరు కాలేని భక్తులు కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ కార్గో ద్వారా పొందవచ్చని సిరిసిల్ల డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండ్‌లోని కార్గో కౌంటర్‌లో రూ. 116లు చెల్లించి, వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఇంటి వద్దకే కల్యాణ తలంబ్రాలు తీసుకువస్తామని పేర్కొన్నారు. వివరాలకు 91542 98577 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.